క్లుప్తంగా

ఫ్లాగ్ డే ఫండ్‌కు విరాళం



విరాళం అందజేస్తున్న డీఏవీ స్కూల్ ప్రిన్సిపాల్

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ డీఏవీ స్కూల్ తరఫున విశాఖ స్టీల్ ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు విరాళం అందజేశారు. ఫ్లాగ్ డే సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో విరాళాలు సేకరిస్తున్నారు. దేశాన్ని రక్షించే సైనికులపై ఉన్న గౌరవంతో పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు రూ.11,000 సేకరించారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుగంధా కుమారి చేతుల మీదుగా అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రావు, కార్యదర్శి మహేష్‌లకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు ప్రిన్సిపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు శివగణేష్, బి.ఎం.స్వైన్ తదితరులు పాల్గొన్నారు.

'పరీక్షా పే చర్చా'కు రిజిస్ట్రేషన్లు

గాజువాక: జనవరిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్వహించనున్న పరీక్షా పే చర్చా కార్యక్రమంలో పాల్గొనేందుకు గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం చేపట్టిన రిజిస్ట్రేషన్‌కు స్పందన లభించింది. ఇప్పటివరకు తమ పాఠశాల ద్వారా 70 మంది ఉపాధ్యాయులు, 700 మంది విద్యార్థులు నమోదు చేయించుకున్నట్టు ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను డైట్ సీనియర్ అధ్యాపకుడు నాగేశ్వరరావు పరిశీలించారు. ఇక్కడ రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్న విధానాన్ని స్కూల్ కమిటీ చైర్మన్ నూకరత్నం, ఉపాధ్యాయుడు జనార్దన్ తదితరులు ఆయనకు వివరించారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో పరీక్షలపై ఉండే భయం, ఆత్రుత, పిల్లల విద్యా భవిష్యత్ గురించి ప్రధాని ఈ కార్యక్రమం ద్వారా ముచ్చటిస్తారని తెలిపారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



కోస్టల్ బ్యాంక్ రజతోత్సవం సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న అధికారులు

అగనంపూడి: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తూ 25 వసంతాలు పూర్తి చేసుకొని అందరి మన్ననలు పొందగలిగామని కోస్టల్ బ్యాంక్ కూర్మన్నపాలెం బ్రాంచ్ మేనేజర్ బి.ప్రసాదరావు తెలిపారు. బ్యాంక్ రజతోత్సవం సందర్భంగా శుక్రవారం బ్రాంచ్ ఆవరణలో కేక్ కట్‌చేశారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారుల ఆదరాభిమానాలతో సంస్థ ప్రగతి పథంలో పయనిస్తోందన్నారు. నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిబ్బంది ఆర్.వాసు, ఎ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన పెరగాలి



అవగాహన కల్పిస్తున్న సీతామహాలక్ష్మి

పెదగంట్యాడ: అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలని, మరో వ్యక్తికి పునర్జన్మ ఇవ్వడానికి జీవన్‌దాన్ మహాదానమని పీఏఎన్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, అఖిల భారత అవయవ దాతల సంఘం కన్వీనర్ పాల నవీన్‌రెడ్డి అన్నారు. పెదగంట్యాడ కూడలిలో శుక్రవారం అవయవ దానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా అఖిల భారత అవయవ దాతల సంఘం చైర్‌పర్సన్ డాక్టర్ గూడూరు సీతా మహాలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవయవ దానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, రక్తదానం కూడా చేయాలని పిలుపునిచ్చారు. అవయవ దానంతో ఎందరో జీవితాల్లో వెలుగు నింపవచ్చన్నారు. 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయ్, వినోద్ బాలు, పల్లా కార్తీక్, పులి రమణారెడ్డి, కిలాన ముసలయ్య, వరలక్ష్మి, గ్రేస్ కళాశాల విద్యార్థులు, వేమన ఐటీఐ విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి పాలన.. అంతా వంచన

- ప్రజలపై విద్యుత్ చార్జీల పెనుభారం
- పథకాలు లేవు.. హామీలు అమలు కావు
- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధ్వజం
- విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా గాజువాకలో వైఎస్సార్‌సీపీ పోరుబాట



సబ్ స్టేషన్‌లోకి రాకుండా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను కట్టడి చేస్తున్న పోలీసులు



అక్కిరెడ్డిపాలెం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి.. అధికారంలోకి రాగానే రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారం మోపారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా శుక్రవారం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. భెల్ వద్ద గల ఏపీఈపీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఆపరేషన్ సబ్ డివిజన్ గాజువాక అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఆపరేషన్ మింది సెక్షన్‌లో ఈడీఈ పార్థసారథికి విద్యుత్ చార్జీలను ఉపసంహరించాలని కోరుతూ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య వినతి పత్రం అందజేశారు. ముందుగా సబ్‌స్టేషన్ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో చేరి కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి వైఎస్సార్‌సీపీ తరఫున సంతాపం తెలిపారు. రెండు సార్లు ప్రధానిగా ఆయన అనేక ఆర్థిక సంస్కరణలు చేపట్టారని కొనియాడారు.

అబద్ధపు హామీలే చంద్రబాబు నైజం

ఈ సందర్భంగా మాజీ మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాల ముందు ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అబద్ధపు హామీలు ఇచ్చి రాష్ట్ర ప్రజలపై విద్యుత్ చార్జీలతో రూ.17 వేల కోట్లు పెనుభారాన్ని మోపారన్నారు. చివరికి ఎస్సీ కాలనీలో ఎస్సీ వర్గాల ప్రజలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందిస్తామని చెప్పి, వారిని కూడా మోసం చేశారన్నారు. ఇప్పుడు అనేక ఎస్సీ కాలనీలు చిమ్మచీకట్లలో మగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాలని చెప్పి.. ఒక్క హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదని దుయ్యబట్టారు.



మింది విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏడీఈ పార్థసారథికి వినతిపత్రం అందిస్తున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, చింతలపూడి

ప్రజల తరఫున పోరాటం

ఎన్నికల హామీల్లో భాగంగా రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాగ్దానాలను నెరవేర్చాలని ప్రజల తరఫున వైఎస్సార్‌సీపీ అలుపెరగని పోరాటం చేస్తుందని అమర్‌నాథ్ తెలిపారు. హామీలు నెరవేర్చ లేక ప్రతీ అంశాన్ని మాజీ సీఎం వైఎస్ జగన్‌పై నెట్టి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నించిన వారిపై కేసులు బనాయించి జైళ్లలో పెడుతున్నారని, ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గుడివాడ అనూష, తిప్పల వంశీరెడ్డి, ఉరుకూటి చందు, మహ్మద్ ఇమ్రాన్, నాయకులు గుడివాడ లతీష్, తిప్పల దేవన్‌రెడ్డి, పల్లా చినతల్లి, మంత్రి శంకర్‌నారాయణ, గంగులూరి రోజారాణి, చిత్రాడ రమణ, బొద్ద గోవింద్, బోగాది సన్యాసిరావు, జీలకర్ర నాగేంద్ర, కాకి అప్పలరెడ్డి, అంగ బాబూరావు, పల్లా పెంటారావు, విరోతి గణేష్, నాగిశెట్టి శ్రీనివాసరావు, పి.గోపి, అడారి శ్రీను, మద్దాల అప్పారావు, బోగాది అప్పారావు, కోమటి శ్రీనివాసరావు, మొల్లి చిన్న, వాకాడ దుర్గా రెడ్డి, శిరీష, దుర్గమ్మ, అన్నపూర్ణ, సోనియా తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి



ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం సీఎం చంద్రబాబు ఎస్సీలకు 200 యూనిట్ల వరకు విద్యుత్ చార్జీలు ఉచితమన్నారు. మాకు కరెంట్ బిల్లులు మాత్ర యథావిధిగా వస్తున్నాయి. ఈ నెల కరెంట్ బిల్లు అధికంగా వచ్చింది. నగరంలో అతిపెద్ద హరిజన కాలనీగా గుర్తింపు ఉన్న మా కాలనీలో చాలా మందికి విద్యుత్ బిల్లుల మోత మోగింది. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఎస్సీలకు ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించాలి.

– పెట్లి అప్పారావు, హరిజన జగ్గయ్యపాలెం

విద్యుత్ చార్జీలను ఉపసంహరించాలి



ఎన్నికల హామీల ప్రకారం విద్యుత్ చార్జీలను పెంచమని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు మా నెత్తిన విద్యుత్ చార్జీల భారం మోపాడు. ఒకే సారి విద్యుత్ బిల్లు వేల రూపాయల్లో పెరిగింది. హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చక పోగా కరెంట్ చార్జీలతో గుండె దడను తెస్తున్నారు. హామీలను నమ్మి రాష్ట్ర ప్రజలు కూటమిని గెలిపిస్తే వారిపై విద్యుత్ చార్జీల రూపంలో రూ.17 వేల కోట్లను భారం మోపి, చంద్రబాబు బహుమతిగా ఇచ్చారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలి.

– కాకి అప్పలరెడ్డి, తుంగ్లాం

ఆలయ పునర్నిర్మాణానికి ఆర్థిక సహకారం



రూ.10 వేల చెక్కును అందిస్తున్న పట్టా రామ అప్పారావు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి పెదమడక నిర్వాసిత కాలనీలోని సీతారామాంజనేయ ఆలయ పునర్నిర్మాణానికి వినియోగదారుల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ పట్టా రామ అప్పారావు సహకారం అందించారు. ఆలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో రామ అప్పారావు రూ.10 వేల చెక్‌ను అందించారు. ఈ సందర్భంగా సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గుదే సుశీలా గజేంద్రరావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలతోపాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ముందు వరుసలో రామ అప్పారావు ఉంటుండటం సంతోషంగా ఉందన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధి విందుల నారాయణరావు మాట్లాడుతూ రామ అప్పారావు సేవా నిరతి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు మోటూరి వెంకటరమణ, మజ్జి శ్రీను, అపరపిని గోవింద్, బలిరెడ్డి అప్పలనాయుడు, విందుల రమేష్, శివాలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు క్యాంపస్ ఇంటర్వ్యూలు

గాజువాక: వివిధ కంపెనీల్లో టెక్నికల్, నాన్ టెక్నికల్ ఉద్యోగాల భర్తీ కోసం స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఇంటర్, డిప్లమో, డిగ్రీ, ఇంజినీరింగ్(బీటెక్) పూర్తి చేసిన అభ్యర్థులు పాల్గొనవచ్చన్నారు. మొత్తం 18 కంపెనీల్లో ఉద్యోగాలను భర్తీ చేస్తారని చెప్పారు. అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు గుర్తింపు కార్డుతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. ఉదయం తొమ్మిది గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయన్నారు.

ఘనంగా ఉక్కు జనరల్ ఆస్పత్రి ఆవిర్భావ దినోత్సవం



ఉత్తమ వైద్యురాలిగా, ఉత్తమ నర్స్‌గా బంగారు పతకాలు అందుకున్న డాక్టర్ అనిత, పద్మావతి

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రి ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆస్పత్రి కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విశాఖలోని మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి చీఫ్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ వి.మురళీకృష్ణ 'క్యాన్సర్ నివారణా చర్యలు' అనే అంశంపై ప్రసంగించారు. అంకాలజీ రంగంలో తాజా పరిణామాలు, ఆందోళన కలిగించే అంశాలను వివరించారు. ఆస్పత్రి విభాగాధిపతి డాక్టర్ జె.ఎస్.సారంగి ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో కొత్త ఎలీసా బ్లడ్ ఎనలైజర్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వైద్య వృత్తిలో వస్తున్న వేగవంతమైన మార్పులకు అనుగుణంగా వైద్యులు, పారామెడికల్ సిబ్బంది సేవలు అందించాలని సూచించారు. 2023–24లో 5.20 లక్షల మంది ఔట్ పేషంట్లు, 6 వేల మంది ఇన్‌పేషంట్లు చికిత్స పొందారన్నారు. 2 వేల చిన్న శస్త్రచికిత్సలు, మోకాలి మార్పిడి, లాప్రోస్కోపిక్ ఆపరేషన్లు సహా 1,850 పెద్ద శస్త్రచికిత్సలు జరిగాయని చెప్పారు. వేడుకల్లో భాగంగా డాక్టర్ కొప్పర్చి కృష్ణమూర్తి పేరిట ఏర్పాటు చేసిన బంగారు పతకాన్ని డాక్టర్ అనితా ఖోబ్రగాడేకు, లక్ష్మీ ప్రభాకర్ పేరిట ఏర్పాటు చేసిన ఉత్తమ నర్సు బంగారు పతకాన్ని పి.పద్మావతికి ప్రదానం చేశారు. దీంతో పాటు ఒక పురుషుడు, ఒక మహిళా హౌస్ కీపింగ్ సిబ్బంది, ఒక అంబులెన్స్ డ్రైవర్‌ను ఉత్తమ సేవలు అందించినందుకు గాను సత్కరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అగనంపూడి: గ్రామ స్థాయిలో భూ సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగపర్చుకోవాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కోరారు. 88వ వార్డు మంగళపాలెంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. భూముల కంప్యూటీకరణ, రీ సర్వే సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్తే సత్వరం పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి మాట్లాడుతూ 66 మంది వినతులు అందించారని, త్వరలో పరిష్కార మార్గం చూపిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లేళ్ల కోటేశ్వరరావు, మొల్లి ముత్యాలు, ప్రసాదుల శ్రీనివాసరావు, నల్లూరి సూర్యనారాయణ, గంధం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు.. యాజమాన్యాలు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

అక్కిరెడ్డిపాలెం: కార్మికులు బాగుంటేనే యజమానులు బాగుంటారని, వీరిరువురి ఐక్యతతో వ్యవస్థ బాగుంటుందని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. విశాఖ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఆటోనగర్ వాసీవా భవనంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో కంపెనీల్లో జరిగిన ప్రమాదాలపై ఎన్నో న్యాయపరమైన అంశాలు చోటు చేసుకున్నాయన్నారు. కార్మికులు, మహిళా కార్మికుల హక్కులు, వారిపై జరుగుతున్న వేధింపులపై అనేక రకాలైన న్యాయ హక్కులు కలిగి ఉంటాయన్నారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎం.సునీత మాట్లాడుతూ పరిశ్రమల్లో కార్మికులకు వర్తించాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ వంటి వాటిలో యాజమాన్యం వర్తింప జేయాల్సి అంశాలపై లేబర్ కమిషన్ అనుసరించవల్సిన అంశాలను వివరించారు. బాల కార్మికులతో పనులు చేయిస్తే తీసుకోనున్న చర్యలు, చైల్డ్ లేబర్ రూల్స్‌ను తెలియజేశారు. ముందుగా వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ మాట్లాడుతూ కార్మికులు, పరిశ్రమల యజమానులు మధ్య సమన్వయం, కార్మికులకు వర్తింపజేయాల్సిన హక్కులపై వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్తలు వై.సాంబశివరాలు, సిహెచ్.నూకరాజు, వాసీవా కోశాధికారి పర్చూరి ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సూర్యకళ

అక్కిరెడ్డిపాలెం: జగ్గయ్యపాలెం రైల్వే క్యాబిన్‌కు సుమారు 500 మీటర్ల దూరంలో గుర్తు తెలియని 30 ఏళ్ల వయసు గల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. శుక్రవారం సమాచారం అందుకున్న గాజువాక ఎస్ఐ ఎల్.సూర్యకళ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వ్యక్తి కుడి చేయి, రెండు పాదాలు కాలిపోయాయని గుర్తించినట్లు తెలిపారు. వ్యక్తి స్కైబ్లూ రంగ్ టీ షర్ట్, నలుపు రంగు ఫుల్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మెడలో ఎరుపు రంగు తాడు, కుడి చేయి దండ చేయి వద్ద ఎరుపు రంగు తాడు కట్టినట్లు గుర్తించామన్నారు. అదే చేయి మణికట్టు వద్ద రిస్ట్ బ్యాండ్ ఉందని, దానిపై శివుడి నామాలు, త్రిశూలం గుర్తులు, హిందీలో మహాకాళ్ అని రాసి ఉందని చెప్పారు. కుడి చేతికి కే అనే అక్షరంతో టాటూ ఉందని, దాని తర్వాత చేయి కాలిపోయి ఉండటంతో ఏమీ రాసి ఉందో తెలియదన్నారు. మృతదేహం జేబును చెక్ చేయగా.. ఈ నెల 21న కై కలూరు నుంచి దువ్వాడ వరకు సెకండ్ మేల్ ఎక్స్‌ప్రెస్ సంబంధించి టికెట్ కలిగి ఉందని తెలిపారు. మృతదేహాన్ని జయహో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు డి.కృష్ణంరాజు సహకారంతో శాంతి రథంలో పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతదేహం వివరాలు తెలిసిన గాజువాక సీఐ: 94407 96014, ఎస్ఐ: 94409 04325 నంబర్లలో సంప్రదించాలని పోలీసులు కోరారు.

మన్మోహన్ సింగ్‌కు నివాళులు



స్టీల్ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ఉక్కునగరం: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. యూనియన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నాయకులు మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి సంతాపం తెలిపారు. నాయకులు మాట్లాడుతూ మన్మోహన్ ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల వల్ల దేశం అభివృద్ధి పథంలో నడిచిందన్నారు. స్టీల్‌ప్లాంట్ విస్తరణకు శంకుస్థాపన చేసి నేటి అధిక సామర్థ్యానికి మూల కారకులయ్యారన్నారు. యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నీరుకొండ రామచంద్రరావు, మంత్రి రాజశేఖర్, కారు రమణ, ప్రభాకరరెడ్డి, ఎస్.ఎ.నాయుడు, జి.వి.సుబ్బయ్య, మద్ది అప్పలరాజు రెడ్డి పాల్గొన్నారు.

మన్మోహన్ మృతి తీరని లోటు

అక్కిరెడ్డిపాలెం: దేశ ఆర్థిక సంస్కరణలతో బడుగు బలహీన వర్గాల జీవన స్థితిగతులు మెరుగు పర్చడానికి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తీసుకున్న విధానాలు ఎనలేనివని కాంగ్రెస్ పార్టీ గాజువాక నాయకులు అన్నారు. ఆయన అకాల మరణానికి చింతిస్తూ గాజువాకలో మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. కాంగ్రెస్ నాయకులు గవర వెంకటరమణారావు, ఉరుకూటి అచ్చిబాబు, దానబోయిన అప్పల నాయుడు, చిమ్మిటి మురళీశ్వరరావు, పల్లెల శ్రీనివాసరావు, పి.ఎల్.ఎన్.గుప్తా, సోడాదాసు సుధాకర్, కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి ఆద్యుడు మన్మోహన్



మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న స్టీల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: దేశం ప్రగతి పథంలో పయనిస్తుందంటే దానికి కారణం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సంస్కరణలే కారణమని స్టీల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వడ్లపూడి అధ్యక్షుడు అప్పలరాజు అన్నారు. వడ్లపూడిలో కొవ్వొత్తులు వెలిగించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యదర్శి మాటూరి రాము, ప్రతినిధులు జి.వీరునాయుడు, బొండా ఈశ్వరరావు, మిద్ది రాము, కె.ఈశ్వరరావు, కర్రి కృష్ణ, గౌరి, ఆనంద్, సురేష్ పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలు మరింత ఉధృతం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మరింత ఉధృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నామని సీపీఎం జిల్లా నాయకుడు కె.ఎం.శ్రీనివాస్ తెలిపారు. 86వ వార్డు కూర్మన్నపాలెం రాజీవ్‌నగర్ కూడలిలోని పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం సీపీఎం 24వ మహాసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పతాకావిష్కరణ చేసి పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తామని ఏమార్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది మంది తెలుగు ప్రజలను మభ్యపెడుతూ వచ్చి.. నేడు ఒక్కో అడుగు ప్రైవేటీకరణ వైపు వేస్తున్నారన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల మందికి ఉపాధి కల్పించే స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలని వేడుకుంటే.. కనికరించని ప్రభుత్వం అదే కర్నాటకలో ఒక చిన్న స్టీల్‌ప్లాంట్‌కు రూ.15 వేల కోట్లు సహాయంగా అందివ్వడం చూస్తుంటే కేవలం విశాఖ స్టీల్‌ప్లాంట్ భూములను కొట్టేయడానికి ఇలా దిగజారిపోతున్నారని ఆరోపించారు. పాలకులు చెబుతున్నది ఒకటి, ఇక్కడి యాజమాన్యం చేస్తున్నది మరొకటిగా కనిపిస్తోందని చెప్పారు. కార్మికులకు ఐదు మాసాలుగా అత్తెసరు జీతాలు చెల్లిస్తూ వేధిస్తుండటం అన్యాయమన్నారు. ఈ నెల 28న నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మార్కెట్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.కృష్ణారావు, కె.గంగాధర్, దత్తాత్రేయ రాజు, జి.సూరిబాబు, గోపాలకృష్ణరాజు, కృష్ణార్జున, అప్పారావు, ఎం.వి.రమణారావు, శివరాలు పాల్గొన్నారు.

ఫేక్ యాప్‌లో పెట్టుబడి

లబోదిబోమంటున్న ఉద్యోగులు

ఉక్కునగరం: ఫేక్ యాప్‌లో పెట్టుబడి పెట్టిన ఉద్యోగులు మోసపోయామంటూ లబోదిబోమంటున్నారు. ఉద్యోగుల సమాచారం మేరకు.. ఓ యాప్‌లో పెట్టుబడి పెడితే 54 రోజుల్లో డబుల్ ఇస్తామని నమ్మబలకడంతో అనేక మంది ఉక్కు ఉద్యోగులు పెట్టుబడి పెట్టారు. తొలుత పెట్టుబడి పెట్టిన వ్యక్తికి కేవలం 25 రోజుల్లోనే రెట్టింపు నగదు వచ్చింది. సదరు ఉద్యోగి ఆ విషయాన్ని పలువురికి చెప్పడంతో వారు కూడా ఆశపడి పెట్టుబడి పెట్టారు. ఇది గ్రహించిన యాప్ నిర్వాహకులు మొదట పెట్టుబడి పెట్టిన వ్యక్తికి నెల జీతంతోపాటు ఇతర బెనిఫిట్‌లు ఆఫర్ చేయడంతో అతడు మరింత మందిని చేర్పించాడు. ఈ యాప్‌పై పెట్టుబడులు ఎక్కువగా రావడంతో ప్రోత్సహించిన వ్యక్తులకు భారీ మొత్తంలో యాప్ నిర్వాహకులు ముట్ట చెప్పినట్టు తెలిసింది. ఇటీవల పెట్టుబడి పెట్టిన వారికి నగదు ఇవ్వడం లేదు. ఇదిలా ఉండగా క్రిస్మస ఆఫర్ అని చెప్పి పెట్టుబడి పెట్టిన 15 రోజుల్లోనే రెట్టింపు ఇస్తామని చెప్పడంతో మరింత మంది ఆకర్షితులై పెట్టుబడులు పెట్టారు. వారం రోజుల కిందట నుంచి పెట్టుబడులు పెట్టిన వారి యాప్ పని చేయకపోవడంతో మోసపోయామని గ్రహించారు. కొంత మంది స్టీల్‌ప్లాంట్ పోలీసులను ఆశ్రయించారు. తొలుత పెట్టుబడిన వ్యక్తి వల్లే తాము మోసపోయామని బాధితులు వాపోతున్నారు. దీనిపై స్టీల్‌ప్లాంట్ సీఐ కేశవరావును సంప్రదించగా.. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ చేస్తున్నామని తెలిపారు.

ఆటో కార్మికుల సంక్షేమానికి కృషి

గాజువాక: గాజువాక పారిశ్రామిక ప్రాంత 86 ఆటో సంఘాల 9వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు కేక్ కట్‌చేసి అభినందనలు తెలిపారు. ఆటో కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు గొలగాని నాయుడు, నాయకులు బొడ్డు నరేష్, ఆళ్ల జగదీష్, బొమ్మన అప్పలరెడ్డి, రెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాను ఉపేక్షించొద్దు



దువ్వాడ పోలీస్ స్టేషన్ వద్ద డీసీపీ-2 మేరీ శాంతి

అగనంపూడి: గంజాయి అక్రమ రవాణా చేసే వారిని, ప్రోత్సహించే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించొద్దని, వారిపై కఠినంగా వ్యవహరించాలని విశాఖ నగర డీసీపీ-2 డి.మేరీ శాంతి ఆదేశించారు. దువ్వాడ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆమె సందర్శించి, కేసుల వివరాలు, పెండింగ్ కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులు, ఆవరణాన్ని పరిశీలించారు. అనంతర డీసీపీ-2 మాట్లాడుతూ గంజాయి రవాణాకు అవకాశం ఉన్న చోట్ల విస్తృత తనిఖీలు, నిఘా పెంచాలన్నారు. సైబర్ నేరాల ఫిర్యాదులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. స్టేషన్ సిబ్బందితో ఆమె మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సీఐ కె.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.